క్లుప్తంగా

ఆల్ఫోర్స్ పాఠశాలకు నోటీసులు జారీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలకు మంగళవారం నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో రాజ గంగారాం తెలిపారు. దసరా సెలవులలో పాఠశాల నడుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. సెలవు దినాల్లో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ పాఠశాలలు నడిపితే శాఖ పరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా ఎంఈవో తెలిపారు.

వేల్పూర్ మండలంలో భారీ వర్షం



వేల్పూర్: వేల్పూర్ మండలంలోని గ్రామాలలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అంక్సాపూర్, వేల్పూర్ ఇతర గ్రామాలలో గంటకు పైగా భారీ వర్షం కురిసింది. అంక్సాపూర్‌లో లోతట్టు ఇళ్లలోకి వరదనీరు చేరింది. మండల గ్రామాలలో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవీపేట: మండలంలోని తుంగిని గ్రామ శివారులో ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఓరగంటి భూమయ్య, గంగాధర్‌లు నవీపేటలో పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వేగంగా వస్తున్న తోటరాజు వీరి బైక్‌ను ఢీకొన్నాడని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో భూమయ్య, రాజులకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. గంగాధర్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జగిత్యాల మెడికల్ కాలేజీలో విద్యార్థినికి సీటు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణానికి చెందిన లింగంపల్లి శ్రీను, సుజాత దంపతుల కుమార్తె లింగంపల్లి శృతి రాష్ట్ర ఎంబీబీఎస్ కోటా కౌన్సెలింగ్‌లో జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీలో ఉచిత సీటు సాధించింది. కాగా, మంగళవారం పట్టణ సామాజిక సేవకుడు, పుడమి రత్న జాతీయ అవార్డు గ్రహీత పట్వారీ తులసికుమార్ శృతిని తన నివాసం శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా శృతి మాట్లాడుతూ తన విజయానికి తోడ్పడ్డ గురువులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్ సిటీ: రైస్‌మిల్లుల్లో పనిచేస్తూ మృత్యువాత పడ్డవారిని, క్షతగాత్రులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వడంతోపాటు రైస్‌మిల్ యాజమాన్యంపై చర్యలుతీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం పురాతన రైస్‌మిల్ గోడకూలి పక్కనగల ఇంటిపై పడడంతో ఆ ఇంటిలో నిద్రిస్తున్న ముగ్గురిలో మహేష్, అతని కూతురు అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్య మహేశ్వరి గాయాలతో బయటపడింది. పాత గోడను తొలగించడంపై నిర్లక్ష్యం చేసిన రైస్ మిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని మహేశ్వరికి ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించడంతోపాటు, ఇందిరమ్మఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, సాయమ్మ, భూలక్ష్మి, కౌసల్య, లింగవ్వ,పుష్ప, తదితరులున్నారు.

నేడు ఆశా వలంటీర్ల సమస్యలపై ధర్నా

నిజామాబాద్ సిటీ: ఆశా వలంటీర్ల సమస్యలపై బుధవారం జిల్లాకేంద్రంలో ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహన్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో ఆశా వలంటీర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశలకు నెల వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంటలపై వన్యప్రాణుల దాడి

- వరి, మొక్కజొన్నలపై అడవి పందులు, కోతుల దాడులు
- పట్టించుకోని అధికారులు
- నందిపేట మండలంలో తీవ్రంగా అడవి ప్రాణుల బెడద



బజార్‌కొత్తూర్ శివారులో అడవి పందుల దాడిలో విరిగిపోయిన మొక్కజొన్న పంట



మాయాపూర్ శివారులో దెబ్బతిన్న వరిపంట

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలో అడవి పందుల గుంపులు, వానరసైన్యం రైతన్నలకు అపారనష్టం కలిగిస్తున్నాయి. చేతికొచ్చిన వరిపంట, మొక్కజొన్న పంటలపై వందలాది కోతులు ఒకవైపు, అడవి పందుల గుంపు మరోవైపు దాడులు చేస్తుండడంతో రైతన్నలు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో పంటలను రక్షించుకునేందుకు రైతులు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు భారీ వర్షాల ధాటికి మరోవైపు అడవి పందులు, వందలాది కోతుల బెడదతో రైతు పీకల్లో నష్టాల్లోకి నెట్టేస్తుంది. పంటను రక్షించుకునేందుకు టపాకాయాలు పేల్చినా, మైకు అరుపులు లాంటి సాధనాలు ఉపయోగిస్తూ వినూత్న ప్రయత్నాలు చేస్తున్న ఫలితం లేకుండా పోతుంది. అటవీ ప్రాంతంలో పండ్ల చెట్లు లేకపోవడం ఆహారం లభించకపోవడంతో అడవిలో ఉండాల్సిన వానరాలు, అడవి పందులు దాడులు చేస్తున్నాయి. దీంతో అడవి ప్రాణుల బెడద తీవ్ర సమస్యగా మారడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

ఫలితం లేకుండా పోయింది: జిల్లాలో వరిపంటను 4,36,695 ఎకరాలలో, మొక్కజొన్న పంటను 52,093 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం చేతికొచ్చిన వేలాది ఎకరాలలో వరి, మొక్కజొన్న పంటలలో కోతులు, అడవి పందులు దాడులు చేస్తూ నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానరాల బెడద నుంచి తప్పించుకునేందుకు గతంలో కూరగాయాలు సాగు చేసిన రైతులు ఈ సారి మొక్కజొన్న పంట సాగు చేసినా కోతులు బెడద తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. పంటలకు నీరు పెట్టేందుకు వచ్చే సమయంలో రైతులపై దాడులు చేస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు.

పంటలను నాశనం చేశాయి



వరి, మొక్కజొన్న పంటలపై అడవి పందులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. ఇదివరకు వందలాది కోతులు వచ్చి పంటలను నాశనం చేశాయి. చేతి కొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు నాశనం చేశాయి. అధికారులు పంటలను పరిశీలించి ఆదుకోవాలి.

– మొగులాజీ, బజార్ కొత్తూర్, రైతు

ఫైలట్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



ముల్లంగి (బి)లో గృహ ప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందిస్తున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్: మండలంలోని ముల్లంగి (బి)గ్రామానికి చెందిన మేడే మౌనిక ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని మంగళవారం గృహ ప్రవేశం చేసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్‌పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందజేశారు. అనంతరం వారితో సహపంక్తి భోజనం చేశారు. మండలంలో మొట్టమొదటిసారిగా ఫైలట్ గ్రామం ముల్లంగి (బి)లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం నూతన గృహం వద్ద కాంగ్రెస్ నాయకులు వినయ్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా సీనియర్‌నాయకుడు రత్నకర్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవిప్రకాష్, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, సీనియర్ నాయకుడు గంగాధర్‌గౌడ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు, అమ్రాద్ విండో చైర్మన్ ఎనుగంటి శ్రీనివాస్‌గౌడ్, మదన్‌పల్లి మాజీ సర్పంచ్ ఎనుగంటి శంకర్‌గౌడ్, మాక్లూర్ మాజీ చైర్మన్ దయాకర్‌రావు, మాక్లూర్ మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ మహిబూబ్, గోపాల్‌నగేష్, లచ్చారెడ్డి, కెశ్యామ్‌రావు, టీఎస్‌రెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ముప్కాల్ తహసీల్దార్ ముజీబొద్దీన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాల్కొండ: మద్దతు ధర కల్పిస్తూ మక్క, సోయా పంటల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ముప్కాల్ తహసీల్దార్ ముజీబొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య మాట్లాడుతూ దళారులు తక్కువ ధరకు మక్కలను కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తడిసిన మక్కలను సైతం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలి



ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీపీ కార్మికులు ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి జీపీ కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అలాగే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం రూ.26 ఇవ్వాలని దీంతో పాటు రూ.10 లక్షల భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బతుకమ్మ, దసర పండుగలకు రెండు జతల దుస్తులు, రెండు జతల చెప్పులు, కొబ్బరి నూనె , గ్లౌజులు ఇవ్వాలన్నారు. కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. నాయకులు ఎల్లయ్య, గంగారాం, లక్ష్మయ్య, విజయ్, కార్మికులు ఎల్లమ్మ, రుకుంబాయి, బీ గంగు, ఎం రాజు, ఆర్ పోసాని, సత్య గంగు తదితరులున్నారు.

నష్ట పరిహారం చెక్కు అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన మల్యాల పెద్ద భోజన్న, ఆకుల రాజేశ్వర్‌కు మంగళవారం ట్రాన్స్‌కో డీఈ రాజేశ్వర్ రావు మంగళవారం నష్టపరిహారానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. గత సంవత్సరం భోజన్నకు సంబంధించిన ఒక గేదె రాజేశ్వర్ కు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. దీంతో ఒక్కో గేదెకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం చెక్కులను డీఈ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏఈ మౌనిక రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలి



బాల్కొండలో మాట్లాడుతున్న సీడీపీవో భార్గవి

బాల్కొండ: ప్రతి ఒక్కరూ పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలని ఆర్మూర్ ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి అన్నారు. మంగళవారం బాల్కొండలో పోషణ్ అభియాన్ మాసోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ్ అభియాన్ మాసం నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలు పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలని సూచించారు. బతుకమ్మ ఆడి పోషణ్ అభియాన్ గురించి వివరించారు.అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వ హించారు. తహసీల్దార్ శ్రీనివాస్, సూపర్ వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



సైన్సు ల్యాబ్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆకాంక్షించారు. ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల నూతనంగా నిర్మించిన సైన్స్‌ల్యాబ్ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికకు అనుగుణంగా విద్యార్థులు తమ దృక్పథాన్ని మార్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పిప్రి కాంప్లెక్స్ హెచ్ఎం విశ్వనాథ్, హెచ్ఎంలు నవీన్, విజయ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తొమ్మిది రూపాల్లో కొలువుదీరిన దుర్గామాత



కల్దుర్కిలో ఫ్రెండ్ యూత్ సొసైటీ మండపంలో తొమ్మిది అవతారాల్లో అమ్మవారు

బోధన్‌రూరల్ : బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో ఫ్రెండ్‌యూత్ సొసైటీ దుర్గాదేవి మండపంలో తొమ్మిదిరూపాల్లో దుర్గామాత కొలువుదీరింది. మండలంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్రెండ్ యూత్ సొసైటీ 18వ వార్షికోత్సవం పురస్కరించుకుని తొమ్మిది దుర్గామాతలను ప్రతిష్ఠాపన చేశారు. గ్రామంలో భారీగా మండపాన్ని నిర్మించి గణపతి, ఛత్రపతి శివాజీ విగ్రహాలతో పాటు తొమ్మిది ప్రత్యేక అవతారాల్లో ఉన్న దుర్గామాతలను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు గ్రామస్తులంతా కలిసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

దుర్గామాత మండపం వద్ద హోమం

వేల్పూర్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో దేవీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత మండపం వద్ద మంగళవారం భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పూజారి పవన్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందిపేట్ : మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమంలో రమేశ్ స్వామి ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించి, అమ్మవారికి పూజలు చేశారు. కేదారేశ్వర ఆశ్రమంలో మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



హోమంలో పాల్గొన్న భక్తులు



వెల్మల్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

ఫుడ్ సైన్స్ కాలేజీలో బతుకమ్మ సంబురాలు



రుద్రూర్: మండలంలోని ఆహార శాస్త్ర విజ్ఞాన కాలేజీలో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. కాలేజీ ఆవరణ, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని రంగురంగుల పువ్వులను సేకరించి బతుకమ్మలను తయారు చేశారు. పూజలు నిర్వహించి కళాశాల ఆవరణలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. విద్యార్థునులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి



ప్రవచనం ఇస్తున్న గుడిమెట్ల మహదేవ్ మహరాజ్

రుద్రూర్: తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని గుడిమెట్ల మహదేవ్ మహరాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రవచనం ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో దేవి నవరాత్రుల సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అన్నపూర్ణ దేవిగా అలంకరణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోటగిరిలో విషాదఛాయలు

- రైస్ మిల్ గోడ కూలి తండ్రి, కూతురు మృతి

రుద్రూర్: తండ్రి, కూతురు (నెల రోజులు) మృతి చెందడంతో కోటగిరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహేష్, మహేశ్వరి ఒకరినొకరు ఇష్టపడి రెండేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు జన్మించింది. తమ ఇంటికి లక్ష్మీదేవి వచ్చిందని తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు. సోమవారం రాత్రి బిడ్డ భవిష్యత్తు గూర్చి మాట్లాడుకుంటూ ఆనందంగా నిద్రపోయారు. ఈ తరుణంలో రైస్ మిల్ గోడ కూలి వీరి ఇంటి పడటంతో నిద్రలోనే భర్త, కూతురు మృతి చెందగా, మహేశ్వరి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కోడలు ఆస్పత్రిలో దీనస్థితిలో ఉండటం చూసి మహేశ్ తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. రైస్‌మిల్ కూలిపోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా మరమ్మతులు చేయించని యాజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుని తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైస్ మిల్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.




కోటగిరిలో ఘటన స్థలంలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్

కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

పాత రైస్ మిల్ గోడ కూలి మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.ఈమేరకు సంఘటన స్థలాన్ని సీపీఐ కోటగిరి మండల కార్యదర్శి విఠల్ గౌడ్, సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, స్థానికులు దత్తు, పోశెట్టి, ముఖేష్ తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

నిజామాబాద్ నాగారం: మహబూబాబాద్ మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడి ఘటనకు వ్యతిరేకంగా మంగళవారం నిజామాబాద్ మెడికల్ కాలేజీ – జీజీహెచ్ అధ్యాపకులు,వైద్య విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యులపై, మెడికల్ సూపరింటెండెంట్ పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డాక్టర్లకు సురక్షితమైన పని వాతావరణం కల్పించాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో స్పెషల్ పోలీసు ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

క్రీడ సమాచారం

- **రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపిక**



జాన్‌పాల్ నాయక్

కమ్మర్‌పల్లి: మండలం చౌట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జాన్ పాల్ నాయక్ అనే విద్యార్థి అండర్–16 సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు జిల్లాలోని ముప్కాల్ మండల కేంద్రంలో జరిగే 35వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాన్‌పాల్ నాయక్‌తో పాటు పీడీ నగేష్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఎంఈవో ఆకాంక్షించారు.

- **వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం**



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎన్వీ హన్మంత్ రెడ్డి, కోశాధికారిగా కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్ వెంకటేశ్వర్ రావు, జీ ప్రకాష్, వీ మల్లా రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, ఎస్ శంకర్, మహమ్మద్ అనిఫ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బీ మల్లేష్ గౌడ్, ఎం శ్రీనివాస్, కే రవీందర్, ఎస్ శ్రీధర్, ఎం యాదిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణలో వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది లోక భూపతి రెడ్డి, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్‌గా వై లలితాదేవి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అబ్జర్వర్‌గా చంద్రా రెడ్డి, రాష్ట్ర ఒలింపిక్ అబ్జర్వర్‌గా ఏ లింగన్న వ్యవహరించారు.

- **ముగిసిన శిక్షణ శిబిరం**



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో 35వ రాష్ట్ర స్థాయి కబడ్డీ బాల, బాలికల కబడ్డీ క్రీడాకారుల శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య.. ప్రధాన కార్యదర్శి గంగాధర్‌లు మాట్లాడుతూ.. అండర్ -16 కబడ్డీ పోటీలకు బాల, బాలికల జట్లను సిద్ధం చేయుట కోసం ముప్కాల్ మండల కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించమన్నారు. ఈసందర్భంగా జిల్లా బాలుర, బాలికల జట్లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25 నుంచి ప్రారంభమవుతాయన్నారు. క్రీడాకారులు సత్తా చాటి జిల్లా పేరును నిలబెట్టాలని కోరారు. కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: వర్షాలకు పంటనష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్‌చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లీని ఎన్ఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లపు వెంకటేశ్ మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పంటలకు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో ధర్పల్లి, భీమ్‌గల్ మండలాల్లో పెద్దమొత్తంలో రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. ఈనెల 29న తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.భూమన్న, నాగలక్ష్మి ,దేవేందర్ సింగ్, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.